అర్ధంతరంగా నిలిచిన బ్రిడ్జి

- ప్రజలు, రైతులకు ఇబ్బందులు
- ఎన్నికల హామీగా మారుతున్న వంతెన నిర్మాణం
- పనులు పూర్తి చేయాలని డిప్యూటీ సీఎంకు రైతుల వినతి


అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి


వినతిపత్రం అందజేస్తున్న రైతులు (ఫైల్)

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సూదన్‌పల్లి – మల్లారెడ్డిపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రెండేళ్ల క్రితం ప్రారంభించిన పనులకు మంజూరైన నిధులు సరిపడకపోవడంతో అసంపూర్తిగానే నిర్మాణం నిలిచిపోయింది. ఆర్‌అండ్‌బీ అధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పనులు నిలిచిపోయి ఏడాదిన్నర కాలం గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల హామీగా బ్రిడ్జి నిర్మాణం

సూదన్‌పల్లి – మల్లారెడ్డిపల్లి గ్రామాలను వేరుచేస్తూ వాగు ఉంది. ఈ వాగుపై వంతెన నిర్మిస్తే సూదన్‌పల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాల రైతులతో పాటు చుట్టు ప్రాంతాలకు చెందిన వారికి సౌకర్యంగా ఉంటుంది. ఈ వంతెన నిర్మాణం ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ. 60ఏళ్లుగా ఈ బ్రిడ్జి ఎన్నికల్లో వాగ్దానంగా మారుతోంది. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి వంతెన నిర్మాణం ప్రధాన పార్టీల ఏజెండాగా మారింది. ఎన్నికలు అయ్యాక సదరు ప్రజాప్రతినిధులు హామీని విమర్శిస్తూ వస్తున్నారు. దీంతో బ్రిడ్జి నిర్మాణం కలగానే మిగులుతోంది.

మళ్లీ ప్రతిపాదనలు

బీఆర్‌ఎస్ పాలనలో అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రత్యేక చొరవతో బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.90 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులు సరిపోక పనులను సదరు కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేశాడు. అర్ధంతరంగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణం కోసం మళ్లీ ప్రతిపాదనలు రూపొందించారు. అదనంగా మరో రూ.12 కోట్ల ప్రతిపాదనలు రూపొందించి ఇప్పటి కాంగ్రెస్ సర్కారుకు పంపారు. అయితే, ఆ ప్రతిపాదనలు రూపొందించి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇప్పటికీ అతీగతి లేదు. ఇటీవల వరంగల్ పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మల్లారెడ్డిపల్లి, సూదన్‌పల్లి గ్రామాల రైతులు కలిసి బ్రిడ్జి పనుల గురించి వివరించారు. సరిపడా నిధులు మంజూరు చేయాలని వారు కోరారు.

వడ్డే ఓబన్న జీవితం యువతకు ఆదర్శం

- బీసీ వెల్ఫేర్ ఇన్‌చార్జ్ డీడీ లక్ష్మణ్


మాట్లాడుతున్న లక్ష్మణ్

కాజీపేట అర్బన్: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అనుచరుడిగా బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా భారత స్వాతంత్య్రం కోసం పోరాడిన వడ్డే ఓబన్న జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని బీసీ వెల్ఫేర్ ఇన్‌చార్జ్ డీడీ లక్ష్మణ్ తెలిపారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో శనివారం వడ్డే ఓబన్న 218వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బహుజన బాంధవుడిగా ఓబన్నను బీసీలు కొనియాడుతారని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి విద్యావైజ్ఞానిక పోటీలకు ఏకశిల విద్యార్థినులు



హసన్‌పర్తి: జాతీయ స్థాయి విద్యావైజ్ఞానిక పోటీలకు ఏకశిల పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని మూల మన్వితారెడ్డి ప్రదర్శించిన 'వ్యవసాయ సాగులో తక్కువ నీటితో ఎక్కువ తేమను పొందడం', అలాగే, ఎనిమిదో తరగతి విద్యార్థిని జస్సీ ప్రదర్శించిన 'చేతి తొడుగు' ప్రాజెక్టులు జాతీయ స్థాయికి అర్హత సాధించినట్లు తిరుపతిరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ సువిజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాళ్ల పద్మావతి పాఠశాల విద్యార్థి ఎంపిక

ఖిలా వరంగల్: ఈనెల 20న పుదుచ్చేరి (చెన్నై)లో జరగనున్న జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు వరంగల్ ఉర్సుగుట్ట ప్రాంతానికి చెందిన తాళ్ల పద్మావతి అంతర్జాతీయ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆర్.అర్జున్ ఎంపికై నట్లు స్కూల్ చైర్మన్ తాళ్ల మల్లేశం తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బహుముఖ వ్యవసాయ పరికరం ఆటో మెటెడ్ నమూనా అనే ప్రాజెక్ట్ ద్వారా విజేత నిలిచి జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్ రెడ్డి నుంచి అర్జున్ ప్రశంసపత్రం అందుకున్నట్లు తెలిపారు. ఈమేరకు విద్యార్థి అర్జున్‌ను స్కూల్ చైర్మన్‌తోపాటు డైరెక్టర్లు వైష్ణవి, వరుణ్, హెచ్‌ఎం స్వర్ణ, ఉపాధ్యాయుడు రామ్‌గోపాల్ శనివారం అభినందించారు.

మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం


సరళను సన్మానిస్తున్న మహిళా నాయకులు

హన్మకొండ: మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మహిళా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ అన్నారు. రెండోసారి మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా నియామకమైన బంక సరళను హనుమకొండ కృష్ణాకాలనీలోని పార్టీ 57వ డివిజన్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ 59వ డివిజన్ అధ్యక్షురాలు తేళ్ల సుగుణ, మహిళా నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా బంక సరళ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని, రైతు భరోసా సహాయాన్ని రూ.12 వేలకు పెంచిందని, భూమిలేని రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇవ్వనుందని, ఇందిరమ్మ ఇళ్లు, కొత్తగా రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. మహిళా నాయకులు లలిత, కరుణ, ఇందిర, సుగుణ, పూలక్క, మేరి పాల్గొన్నారు.

వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి


నివాళులర్పిస్తున్న సత్యనారాయణ, బాధ్యులు

విద్యారణ్యపురి: స్వామి వివేకానందను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. బీవీపీ ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్‌రోడ్డులోని అవంతి హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన వివేకానందుడి జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు విస్తరింపజేసిన మహనీయుడు వివేకానంద అని కొనియాడారు. తొలుత వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీవీపీ బాధ్యులు వెంకటరెడ్డి, దామోదర్, పాఠశాల ప్రిన్సిపాల్ గీతారాణి, శ్రుతి పాల్గొన్నారు. అలాగే, బీవీపీ ఆధ్వర్యంలో హనుమకొండలోని కేఎల్‌ఎన్.రెడ్డి కాలనీలోని డఫోడైల్ హైస్కూల్‌లో నిర్వహించిన వివేకానందుడి జయంతి కార్యక్రమంలో బీవీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్, బాధ్యులు వివేకానంద ప్రసాద్, రామారావు, రామానుజ స్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- మంత్రి పొన్నం ప్రభాకర్

కాజీపేట: తెలంగాణ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీ పీజీఆర్ గార్డెన్స్‌లో శనివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాగులో ఉన్న ప్రతీ ఎకరానికి త్వరలో రైతు భరోసా కింద ఆర్థిక సాయం అందించేందుకు మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. రెండు వారాలకుపైగా గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసిన రైతు కూలీలను గుర్తించి రూ.6 వేల చొప్పున రెండు విడతలుగా అందిస్తామని, ఇందిరమ్మ ఇళ్ల అర్హులను గ్రామసభలో ఎంపిక చేస్తామన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీలను వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీఏ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రైతులకు రూ.2లక్షల రుణామాఫీ చేసినప్పటికీ ప్రతిపక్షాలు అర్థం, పర్థం లేని విమర్శలతో ప్రజలను గందరగోళానికి గురిచేయడం తగదన్నారు. పార్టీశ్రేణులు క్షేత్రస్థాయిలో విమర్శలకు దీటుగా సమాధానం చెప్పాలని సూచించారు.

అంధుల ఆరాధ్యుడు లూయిస్ బ్రెయిలీ


పూలమాల వేస్తున్న రవి, అంధ ఉద్యోగులు

హన్మకొండ: అంధులకు లిపి అందించిన మహనీయుడు, ఆరాధ్యుడు లూయిస్ బ్రెయిలీ అని శ్రీలక్ష్మీ నారాయణ అంధుల, అనాథల సంక్షేమ సంస్థ కార్యనిర్వాహకులు అక్కల రవి, మౌనిక కొనియాడారు. హనుమకొండ రాంనగర్‌లోని తెలంగాణ అంధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో శ్రీలక్ష్మీ నారాయణ అంధుల, అనాథల సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి సంస్థ కార్యనిర్వాహకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వడ్డేపల్లిలోని ఒయాసిస్ అనాథాశ్రమంలో నిత్యావసర సరుకులు అందించారు. నిరుద్యోగ అంధులకు శబ్ద పరికరాలు అందించారు. కార్యక్రమంలో అంధ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'స్పెక్ట్రా'లో సంక్రాంతి వేడుకలు


అతిథులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

హన్మకొండ: హనుమకొండలోని స్పెక్ట్రా స్కూల్‌లో సంక్రాంతి వేడుకలను శనివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేసి, పాఠశాల ఆవరణలో రంగవల్లులు వేసి, పతంగులు ఎగురవేసి, గంగిరెద్దుల ప్రదర్శన నిర్వహించారు. వరంగల్ ఎల్‌బీ కళాశాల అధ్యాపకురాలు పద్మజ, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు లావణ్య ముఖ్యఅతిథులుగా పాల్గొని సంక్రాంతి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్.ప్రశాంతి, నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎల్.రాంగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'విశ్వశాంతి'లో సంబురాలు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని విశ్వశాంతి డీజీ స్కూల్‌లో శనివారం ముందస్తు సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేసి సందడి చేశారు. నూతన సంవత్సరంలో నూతన ఆలోచనలతో ముందుకు సాగాలని పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ సంపత్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



సంక్షిప్తంగా

ఐక్యతతో మరిన్ని విజయాలు సాధించాలి



న్యూశాయంపేట: కార్మికులు ఐక్యంగా ఉండి మరిన్ని విజయాలు సాధించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి పిలుపునిచ్చారు. రాంనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ పోరాటాల ఫలితంగా అన్‌మ్యాన్డ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు ఇచ్చేందుకు సీఎండీ వరుణ్‌రెడ్డి అంగీకరించారని గుర్తుచేశారు. కంపెనీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి వెంకట్‌రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్, ఎల్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాల్యం గుర్తుకొచ్చింది

హసన్‌పర్తి: విద్యార్థుల ప్రదర్శనలు చూసి తన బాల్యం గుర్తుకొస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. 65వ డివిజన్ ఎల్లాపురంలోని మాంటిసోరి పాఠశాలల వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. టీవీల్లో ప్రసారమవుతున్న సీరియళ్లు సమాజంపై దుష్ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎంజీఎం: ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 17,514 మంది ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్‌ఖన్నా కోరారు. ఈమేరకు వరంగల్‌కు వచ్చిన డీహెచ్ డాక్టర్ రవీంద్రనాయక్ శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్‌ఖన్నా మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికి హెల్త్‌కార్డులు, హెల్త్ ఇన్సూరెన్స్, ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నూకల అంజి, వైకుంఠం, శ్రీనివాస్, బాబు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ కాల్స్‌ను నమ్మొద్దు

కాజీపేట: డిజిటల్ అరెస్టులు అంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్న నేపథ్యంలో ప్రజలు భయపడకుండా ధైర్యంగా ఉండాలని సీఐ సుధాకర్ రెడ్డి సూచించారు. వెంకటాద్రినగర్ కాలనీలో శనివారం ఆయన మాట్లాడుతూ అసలు డిజిటల్ అరెస్ట్ అనే పద్ధతే లేదని, ఎవరైనా పోలీసుల దుస్తుల్లో వాట్సప్ కాల్ చేస్తే నిజమని నమ్మి భయపడొద్దన్నారు.

జిల్లా సదస్సును జయప్రదం చేయాలి

న్యూశాయంపేట: ఈనెల 23న జరగనున్న మత్స్యకారుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య కేంద్ర కమిటీ సభ్యురాలు కే.పద్మ పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కమిటీ సమావేశాన్ని రాంనగర్ కార్యాలయంలో విజేందర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు.

లబ్ధిదారుల జాబితా తయారు చేయాలి

- వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్: ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీ, రైతు భరోసా పథకాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం లబ్ధిదారుల జాబితా తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పథకాల అమలుపై శనివారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా పథకంలో అర్హులైన రైతులను చేర్చాలని, పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఆర్థిక సాయం అందించేందుకు లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని సూచించారు. 16న పరిశీలన ప్రారంభించి 20 వరకు పూర్తిచేయాలన్నారు. 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించి, తుది జాబితా ఆధారంగా లబ్ధిదారులను ఖరారు చేయాలని ఆదేశించారు. డీఆర్వో విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డీఆర్డీఓ కౌసల్యాదేవి, ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, డీఎస్‌ఓ కిష్టయ్య, గృహనిర్మాణ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బోధనలో ఆధునిక పద్ధతులు పాటించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న జ్యోతి

కేయూ క్యాంపస్: విద్యాబోధనలో అధ్యాపకులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఆధునిక పద్ధతులు పాటించాలని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ రీజినల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జ్యోతి సూచించారు. హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ కోర్సుల విద్యార్థులకు బోధించే అధ్యాపకులకు శనివారం ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధ్యాపకులు శాస్త్రీయ అవగాహనతో ఆధునిక పద్ధతుల్లో బోధించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్, లైబ్రరీ సైన్స్, ఎంబీఏ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ బోధన అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌బీ శాస్త్రి సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

హన్మకొండ చౌరస్తా: భారత మాజీ ప్రధాని, దివంగత లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కొనియాడారు. ఎల్‌బీ శాస్త్రి వర్ధంతి సందర్భంగా బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జై జవాన్, జై కిసాన్ అంటూ దేశ స్థితిగతులు మార్చిన దార్శనికుడు, ఎన్నో విప్లవాత్మక సంస్కరణలకు ఆద్యుడు ఎల్‌బీ శాస్త్రి అని గుర్తుచేశారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, పీసీసీ సభ్యుడు ఈవీ.శ్రీనివాసరావు, మోజెస్‌ఆనంద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సరళ, నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, బొంత సారంగం పాల్గొన్నారు.

నేతన్న పొదుపు పథకం జీఓపై హర్షం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వరంగల్: తెలంగాణ నేతన్న పొదుపు పథకం అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలపడంతోపాటు జీఓ జారీ చేసి రూ.168 కోట్ల నిధులు విడుదల చేసినందుకు వరంగల్ పద్మశాలి సంఘాలు, చేనేత కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వరంగల్ కొత్తవాడ మార్కండేయ దేవాలయ ఆర్చీ నుంచి గోపాలస్వామి గుడి జంక్షన్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు.

టీబీ రహిత దేశం కోసం కృషి చేయాలి


మాట్లాడుతున్న నారాయణస్వామి

కాజీపేట రూరల్: టీబీ (క్షయ) రహిత దేశం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (సీఎంఎస్) డాక్టర్ కె.నారాయణస్వామి సూచించారు. టీబీ ముక్త్ భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని ఆస్పత్రిని సంప్రదించాలలన్నారు. కార్యక్రమంలో కాజీపేట రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ నాయక్, రైల్వే ఆస్పత్రి వైద్యాధికారి నిరంజన్‌రావు, రైల్వే స్టేషన్ మేనేజర్ రవీందర్, రైల్వే సీసీఐ సజ్జన్‌లాల్, జిల్లా టీబీ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, టీసీటీసీ కిరణ్‌కుమార్, డీపీపీఎం నగేష్ పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సంక్షేమమే ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

హన్మకొండ: అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ –327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ తెలిపారు. హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని యూనియన్ కార్యాలయం పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో ఎన్పీడీసీఎల్ అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్కర్లను ఆర్టిజన్లుగా గుర్తించేలా ప్రభుత్వం, ఎన్పీడీసీఎల్ యాజమాన్యంపై ఒత్తిడి పెంచినట్లు తెలిపారు. సమావేశంలో టీఎస్‌ఈఈయూ –327 ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ తులసి శ్రీమతి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుండా శ్రీనివాస్, యూనియన్ నాయకులు వెంకన్న, సుధాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 12న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. వినాయకనగర్, సర్క్యూట్ హౌస్ రోడ్డు, జిల్లా కోర్టుల సముదాయం, వరంగల్ కలెక్టరేట్, కేఎల్‌ఎన్ రెడ్డి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, పీజీఆర్ అపార్ట్‌మెంట్స్, పీజీఆర్ గార్డెన్, ఫంక్షన్ హాల్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డికి అవార్డు



కాజీపేట రూరల్: కాజీపేట బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డికి ఫ్రెడ్ ఆఫ్ ఇండియా అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ సేవా సంస్థ ఏఎస్‌ఎస్‌ఐఎస్‌టీ ఫౌండర్ రంగారావు 50 వసంతాల సేవా గోల్డెన్ జూబ్లీని పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల్లోని ఉత్తమ స్వచ్ఛంద సేవలు అందించినందుకు శౌరిరెడ్డిని ఫ్రెడ్ ఆఫ్ ఇండియా అవార్డుకు ఎంపిక చేశారు. చిలుకలూరిపేటలో శనివారం జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ రవి, ఈఎఫ్‌ఎఫ్‌ఓఆర్‌టీఎస్ సంస్థ ఫౌండర్ మోహన్‌రావు చేతుల మీదుగా అవార్డును శౌరిరెడ్డి అందుకున్నారు.

షోటోఖాన్ కరాటే రాష్ట్ర అధ్యక్షుడిగా బైరి లింగమూర్తి



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన బైరి లింగమూర్తిని షోటోఖాన్ కరాటే రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు షోటోఖాన్ జపాన్ కరాటే దూ ఇండియా హంబు సంస్థ చీఫ్ ఇన్‌స్పెక్టర్, ఎగ్జామినర్ ఇండియా చీఫ్ క్యూసే రచ్చ శ్రీనుబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు బైరి లింగమూర్తికి నియామక పత్రాన్ని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అందజేసి అభినందించారు.

కానిస్టేబుల్‌కు అభినందనలు




కాజీపేట అర్బన్: మడికొండ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జయరాజ్‌ను కాజీపేట ఏసీపీ తిరుమలరావు శనివారం అభినందించారు. గత నవంబర్ 16 నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు కన్నూరు సైక్లింగ్ క్లబ్ కేరళ ఆధ్వర్యంలో నిర్వహించిన 30రోజుల్లో వేయి కిలోమీటర్ల ఛాలెంజ్‌ను జయరాజ్ పూర్తిచేయగా, పోస్ట్ ద్వారా సర్టిఫికెట్, మెడల్‌ను క్లబ్ పంపించింది. ఈమేరకు జయరాజ్‌కు సర్టిఫికెట్, మెడల్‌ను ఏసీపీ అందజేసి అభినందించారు.

నిత్యావసరాలు, నగదు పంపిణీ



ఖిలా వరంగల్: వరంగల్ పెట్రోల్‌బంక్ పోచమ్మ టెంపుల్ వద్ద గామ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ సీఈఓ దుర్గప్రసాద్ ఆధ్వర్యంలో కరీమాబాద్‌కు చెందిన పీడీ జోపాలు, సరోజన, స్వప్న, దాసరి లక్ష్మయ్య నేతృత్వంలో ఎంపిక చేసిన పేదలకు రూ.వేయి నగదుతో పాటు నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. సేవాభావంతో నిరుపేదలకు అండగా నిలవాలనే లక్ష్యంతో సరుకులను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.

సంప్రదాయాలు కొనసాగించాలి



ఖిలా వరంగల్: సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగించాలని రంగశాయిపేట వివిధ కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్ అన్నారు. 43వ డివిజన్ గణేష్‌నగర్‌లో శనివారం నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు సారంగం, సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయ్, రాధాకిషన్, తదితరులు పాల్గొన్నారు.

పాయసం నివేదించే పండుగ

హన్మకొండ కల్చరల్: భక్తితో భగవంతుడికి అమృతం వంటి పాయసాన్ని నివేదించే పండుగే కుడారై పండుగని గోదామాధవ ఆధ్యాత్మిక కేంద్రం నిర్వాహకుడు ఆరుట్ల శ్రీనివాసాచార్య స్వామి ఉద్బోధించారు. వికాస్‌నగర్‌లోని గోదామాధవ ఆధ్యాత్మిక కేంద్రంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం పూజలు నిర్వహించారు.